సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం ¦ 6 ¦ జనవరి ¦ 2025



ఆకుపచ్చని బంగారం

వెదురు సాగు కాసులు కురిపిస్తోంది. ఓ రైతు ఇంట వెలుగులు నింపుతోంది. గ్రామీణ పేదలకు విరివిగా ఉపాధి కూడా కల్పిస్తోంది.

8లో



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.0°/10.9°

జిల్లా పరిధిలో ఆదివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రాత్రి వేళ ముమ్మర గస్తీ



అమడగూరు చెక్‌పోస్టు వద్ద వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్‌: జిల్లా వ్యాప్తంగా పోలీసులు రాత్రి వేళ ముమ్మరంగా గస్తీ నిర్వహిస్తూ వాహనాలు తనిఖీ చేపడుతున్నారు. చోరీల నియంత్రణ, అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రాత్రివేళ ముమ్మరంగా గస్తీలు చేపడుతూ నైట్‌ బీట్‌ చెకింగ్‌లు ఏర్పాటు చేసి అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజాశాంతికి భంగం కలిగించిన వారిపై ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. హెల్మెట్‌ ప్రాముఖ్యతపై అవగాహన కలిగిస్తున్నారు. గంజాయి, అక్రమ మద్యం రవాణా, నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు చేస్తున్నారు. గ్రామాలను సందర్శించి గొడవలకు వెళ్లకుంగా ప్రశాతంగా జీవించాలని అవగాహన కల్పిస్తున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక

ప్రశాంత నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో విన్నవించుకోవచ్చని సూచించారు.

ఎస్పీ కార్యాలయంలో..

పుట్టపర్తి టౌన్‌: ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. అర్జీదారులు తమ ఆధార్‌కార్డును తప్పని సరిగా వెంట తీసుకుని రావాలని ఎస్పీ రత్న సూచించారు.

జిల్లా అండర్‌-12 క్రికెట్‌ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: నగరంలో ఆదివారం జిల్లా అండర్‌-12 బాలుర క్రికెట్‌ జట్టును ఎంపిక చేశారు. సెలక్షన్‌ కమిటీ చైర్మన్‌గా కమలాకర్‌ నాయుడు, సభ్యులుగా ఎస్‌ఎల్‌ఎన్‌ ప్రసాద్‌, ఎం. భార్గవ్‌ ఉన్నారు. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు కడపలో జరగనున్న సౌత్‌ జోన్‌ మ్యాచ్‌లో ఈ జట్టు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.

జట్టులో చోటు దక్కించుకున్న వారు వీరే: హపీష్‌ రెడ్డి, ఏ. హేమచంద్రా నాయక్‌, జి. ధనుష్‌, జై వీర్‌ రెడ్డి, ఎం. తమోఘ్న, లలిత్‌ కిశోర్‌, రోహితేశ్వర రాజు, చరణ్‌ తేజ్‌ (అనంతపురం), రామ్‌ చరణ్‌ (హిందూపురం), బి. ఉత్తేజ్‌ యాదవ్‌, ఎస్కే ఇస్మాయిల్‌ (గుంతకల్లు), బీఎం మోక్షజ్ఞ తేజ (కళ్యాణదుర్గం), టి. గణేష్‌ (ధర్మవరం),బృందావన్‌, ఎస్‌. వెంకట లిఖిత్‌ రెడ్డి (తాడిపత్రి). స్టాండ్‌ బై (కుషాల్‌ రాయల్‌, అనంతపురం), కమ్రాణ్‌ ఫహద్‌ (హిందూపురం), మన్సూన్‌ లలిత్‌ సాయి (అనంతపురం), ఎం. రాజా (ధర్మవరం), బి. ప్రజ్వల్‌ (నార్పల).

సంతల్లో వసూళ్ల పర్వం

అనంతపురం అగ్రికల్చర్‌: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో వసూళ్ల పర్వం సాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కొందరు ప్రబుద్ధులు దందాకు తెరలేపారు. మార్కెట్‌ యార్డులో ప్రతి శని, ఆదివారం జరిగే జీవాలు, పశువుల సంతను పలువురు 'పచ్చ' నేతలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఎమ్మెల్యే అనుచరులమని చెప్పుకుంటూ దోచేస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ, కేరళ, తమిళనాడుతో పాటు ఇతర జిల్లాలకు జీవాలు, పశువులు తరలిస్తున్న క్రయ విక్రయదారులు, వాహనదారులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే పంచుకోవడంలో తేడాలొచ్చి బాహాబాహీకి దిగుతున్నారు. ఇక.. 'పచ్చ' నేతలతో పాటు మున్సిపాల్టీ వాళ్లమంటూ కొందరు, పోలీసు వాళ్ల మంటూ ఇంకొందరు, మీడియా వాళ్ల మంటూ మరికొందరు ఇష్టారాజ్యంగా డబ్బులు లాగుతుండటంతో రైతులు, వ్యాపారులు, వాహనదారులు, జీవాల పెంపకందారులు గగ్గోలు పెడుతున్నారు. కూటమి సర్కారు వచ్చిన తర్వాత మార్కెట్‌ యార్డు సంతల్లో 'బాదుడు'కు దిగింది. గతంలో ఒక్కో గొర్రెకు వసూలు చేసే రుసుంరూ.30 నుంచి రూ.50కు, ఒక్కో పశువుకు రూ.100 నుంచి రూ.200 ప్రకారం పెంచింది. సర్కారు చర్యలతో ఇప్పటికే ఇబ్బంది పడుతుండగా.. ఈ నేపథ్యంలోనే కొందరు వసూళ్లకు తెరతీయడంతో సంతలకు వచ్చే వారు అల్లాడిపోతున్నారు.

నలిగిపోతున్న నేతన్న



పట్టుచీరల అమ్మకాలు, కొనుగోలుకు ప్రసిద్ధిగాంచిన సిల్క్‌సిటీ ధర్మవరం నేడు దందాలు, దౌర్జన్యాలకు కేరాఫ్‌గా మారుతోంది. కూటమి నాయకుల చెరలో చేనేతలు, వ్యాపారులు నలిగిపోతున్నారు. ఎక్కడ సెంటు స్థలం కొన్నా, స్థలమో, పొలమో అమ్మినా బెదిరింపులు మొదలవుతున్నాయి. ఎంతో కొంత ముట్టజెబితే ఓకే.. లేదంటే తీవ్రమైన మనోవేదనకు లోనయ్యేలా కూటమి పార్టీల నాయకులు, వారి అనుచరులు ఇబ్బందులు పెడుతున్నారు. కూటమిని నమ్మి ఓట్లు వేసిన పాపానికి అనుభవిస్తున్నామని జనం పశ్చాత్తాప పడుతున్నారు. ఇటీవల చేనేతల సన్మాన కార్యక్రమంలో స్వయంగా కదిరి టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ చేసిన వ్యాఖ్యలు ధర్మవరంలో జరుగుతున్న దురాగతాలు ఎంత తీవ్రస్థాయిలో ఉన్నాయో అద్దం పడుతున్నాయి.

కూటమి చెరలో 'సిల్క్‌ సిటీ'

- ఆరు నెలలుగా దందాలు, బెదిరింపులు, దౌర్జన్యాలు
- మదనపడుతున్న వ్యాపారులు, చేనేత కార్మికులు
- కందికుంట వ్యాఖ్యలతో బయటపడ్డ దౌర్జన్యాల పర్వం
- ఇంత జరుగుతున్నా పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి టాస్క్‌ఫోర్స్‌: సార్వత్రిక ఎన్నికలు -2024లో ధర్మవరం నియోజకవర్గం నుంచి కూటమి పార్టీల తరఫున సత్యకుమార్‌ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం మంత్రి పదవిని అలంకరించారు. రాష్ట్రంలోనే అభివృద్ధిలో ధర్మవరాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతారని అందరూ ఆశించారు. అయితే ఆయన నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడం, చుట్టపు చూపుగా వచ్చి వెళ్తుండటంతో కూటమి పార్టీల నాయకులు దురాగతాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. వారి దౌర్జన్యాలను కట్టడి చేసేవారే లేకుండా పోయారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ధర్మవరంలోని నేసేపేటలో అయితే బడా వ్యాపార వేత్తలు, చేనేతలు, చేనేత వ్యాపారులే టార్గెట్‌గా కూటమి నాయకులు రెచ్చిపోతున్నారు. డబ్బులు ఇవ్వాలంటూ, తమ పొలాలు, ప్లాట్లు చెప్పిన ధరకు కొనాలంటూ బెదిరింపులు మొదలయ్యాయి. ఒక్కరు కాదు... ఇద్దరు కాదు దౌర్జన్యాలకు ఎందరో బలవుతున్నారు. కానీ స్వతహాగా మృదుస్వభావులైన చేనేతలు బయటకు చెప్పుకోలేక తీవ్ర మనోవేదనకు లోనవుతున్నారు.

దురాగతాల్లో మచ్చుకు కొన్ని..

నేసేపేటలోని ఓ పట్టుచీరల వ్యాపారి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రియల్టర్‌ నుంచి కొంత భూమిని కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇది తెలుసుకున్న టీడీపీ నాయకుడి అనుచరుడు సదరు వ్యాపారిని బెదిరించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన వారితో భూమిని ఎలా కొంటావని బెదిరించి రూ.30 లక్షల దాకా వసూలు చేసినట్లు సమాచారం.

➡ కూటమి పార్టీల గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన మరో పట్టు చీరల వ్యాపారిని ప్రభుత్వం రాగానే కొందరు టీడీపీ కార్యకర్తలు ఫోన్‌లో కోట్లాది రూపాయలు కావాలని డిమాండ్‌ చేశారు. ఇందుకు సదరు వ్యాపారి అంగీకరించక పోవడంతో బెదిరింపులు ఎక్కువయ్యాయి. దీంతో చేసేది లేక ఆ వ్యాపారి మంత్రి కోటరీలో చేరిపోయారు.

➡ పట్టణానికి చెందిన ఇద్దరు చేనేత వ్యాపారులు గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపారన్న కారణంతో టీడీపీ నాయకుని అనుచరులు వారి ఇళ్ల వద్ద అలజడులు సృష్టించి భయాందోళనకు గురిచేశారు. వారిలో ఒకరితో రూ.కోటికి పైగా వసూలు చేయగా మరో వ్యాపారితో మార్కెట్‌ రేటు కంటే రెండురెట్లు ఎక్కువకు భూమిని కొనుగోలు చేయించి కోట్లాది రూపాయల లబ్ధి పొందారు.

➡ రేగాటిపల్లికి చెందిన భూముల్లో వెంచర్‌లు వేసినందుకు అడ్డు చెప్పకుండా ఉండేందుకు హిందూపురానికి చెందిన భూ యజమానులను బెదిరించి జనసేన నాయకులు ఒక యజమానితో 60 సెంట్లు, మరో యజమానితో 1.60 ఎకరాల భూమిని బినామీ పేర్లతో అప్పణంగా రాయించుకున్నారు. అంతేకాక ల్యాండ్‌ సెటిల్‌మెంట్‌లు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

➡ బీజేపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అనుచరులు మున్సిపాలిటీలో ప్లాన్‌ అప్రూవల్స్‌ ఇప్పించేందుకు పెద్ద దుకాణమే తెరిచారు. వారి అనుమతి లేకుండా ప్లాన్‌ అప్రూవల్స్‌ రాకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. వారికి అంతో ఇంతో డబ్బు ముట్టజెబితే ప్లాన్‌ అప్రూవల్స్‌ మంజూరు చేయించేలా స్కెచ్‌ వేశారు. అంతేకాక డీ చెర్లోపల్లి వద్ద ఇసుకను జేసీబీలు, ట్రాక్టర్‌ల ద్వారా రాత్రింబవళ్లు అక్రమంగా రవాణా చేస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు.

పోటాపోటీగా వసూళ్లు

అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలలో కూటమి పార్టీల నాయకులు ఒకరికి మించి ఒకరు ఉన్నారు. దీంతో చేనేతలు, వ్యాపారులు తమ సామాజిక వర్గానికి చెందిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌ వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ధర్మవరంలో సన్మాన సభ ఏర్పాటు చేసి తామంతా ఐక్యంగా ఉన్నట్లు చాటారు. ఈ వేదిక నుంచి కందికుంట చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. సొంత కూటమి పార్టీల నేతల దౌర్జన్యాలు, దాడులను కందికుంట ఎండగట్టినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ధర్మవరం ప్రజలు చరిత్రలో ఎందరో ఎమ్మెల్యేలు, ఎన్నో ప్రభుత్వాలను చూశారు. అయితే ఇంతటి భయంకరమైన పరిస్థితులను ఎప్పుడూ చూడలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ దురాగతాలను అదుపు చేయకపోతే రానున్న ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని వారు చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడం గమనార్హం.

చిన్నారిపై అత్యాచారయత్నం

- పోక్సో కేసు నమోదు

పరిగి: అభం శుభం తెలియని చిన్నారిపై ఓ కామాంధుడు అత్యాచారయత్నం చేశాడు. ఎస్‌ఐ రంగడుయాదవ్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామంలో నివాసముంటున్న ఉప్పర సునీల్‌కుమార్‌ (27) సమీపంలోని ఏడేళ్ల బాలికపై కన్నేశాడు. ఆదివారం ఇంట్లో బాలిక ఒంటరిగా ఆడుకోవడాన్ని గమనించాడు. ఇదే అదునుగా భావించిన సునీల్‌కుమార్‌ బాలికను లొంగదీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ లోపు కుటుంబ సభ్యులు రావడంతో ఆ యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సునీల్‌కుమార్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలింపు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆవు

- వివాహిత దుర్మరణం



మృతి చెందిన ఆదిలక్ష్మమ్మ

పెనుకొండ: ఆవు ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొన్న ఘటనలో వెనుక కూర్చున్న వివాహిత తీవ్రగాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. వివరాలిలా ఉన్నాయి. పెనుకొండ పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన ఆదిలక్ష్మమ్మ (41) తన భర్త రామాంజనేయులుతో కలిసి ఆదివారం కర్ణాటకలోని నాగలమడక సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వెళ్లారు. అక్కడ షష్టి పూజ ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరారు. పెనుకొండ సమీపాన జర్నలిస్టు కాలనీ వద్ద వీరి ద్విచక్రవాహనాన్ని ఆవు బలంగా ఢీకొంది. దంపతులిద్దరూ ఎగిరి రోడ్డుపై పడ్డారు. తల, ముక్కు, చెవుల్లోంచి తీవ్ర రక్తస్రావమై ఆదిలక్ష్మమ్మ మృతి చెందారు. భర్త స్వల్ప గాయాతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా కుమారులిద్దరూ అయ్యప్ప ఇరుముడి కట్టుకుని శబరిమలకు వెళ్లారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ముగిసిన బాలవికాస్‌ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అసోం బాలవికాస్‌ పూర్వ విద్యార్థుల నృత్య ప్రదర్శన



సత్యసాయి మహాసమాధి చెంతకు ర్యాలీగా వస్తున్న బాలవికాస్‌ గురువులు, పూర్వ విద్యార్థులు



కేంద్ర సహాయ మంత్రి సోమన్నకు సత్యసాయి చిత్రపటాన్ని బహూకరిస్తున్న రత్నాకర్‌ రాజు

ప్రశాంతి నిలయం: బాలవికాస్‌ పూర్వ విద్యార్థుల రెండు రోజు సమ్మేళనం ఆదివారం ముగిసింది. చివరి రోజు ఉదయం బాలవికాస్‌ పూర్వ విద్యార్థులు, గురువులు యజుర్‌ మందిరం నుంచి ర్యాలీగా ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహాసమాధి చెంతకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బాలవికాస్‌ లక్ష్యాలకు కట్టుబడి ఉంటామంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. సేవా భావంతో ఉత్తమ సేవలు అందించిన బాలవికాస్‌ గురువులకు సత్యసాయి సెంట్రల్‌ ట్రస్ట్‌ మేనేజింగ్‌ ట్రస్టీ ఆర్‌.జె.రత్నాకర్‌ రాజు, గ్లోబల్‌ కౌన్సిల్‌ చైర్మన్‌ చక్రవర్తి జ్ఞాపికలను బహూకరించారు. అసోంకు చెందిన బాలవికాస్‌ విద్యార్థులు జానపద నృత్య ప్రదర్శన నిర్వహించారు.

కేంద్రమంత్రికి ఘన స్వాగతం

ప్రశాంతి నిలయం: కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న ఆదివారం మధ్యాహ్నం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం చేరుకున్నారు. రోడ్డు మార్గంలో ప్రత్యేక కాన్వాయ్‌ ద్వారా చేరుకున్న ఆయనకు సత్యసాయి సెంట్రల్‌ ట్రస్ట్‌ మేనేజింగ్‌ ట్రస్టీ రత్నాకర్‌ రాజు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన గ్రీన్‌ రూంను సందర్శించారు. ట్రస్ట్‌ సేవా కార్యక్రమాలను, ప్రశాంతి నిలయంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర మంత్రి వచ్చిన సమయానికి దర్శన వేళలు ముగియడంతో ఆయన సత్యసాయి మహాసమాధిని దర్శనం చేసుకోలేకపోయారు. కార్యక్రమంలో హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం... బ్రహ్మ రథోత్సవం

- పావగడలో అంత్య సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మ రథోత్సవానికి పోటెత్తిన జనం



మూలవిరాట్‌కు పూజలు



భక్త జనం మధ్య సాగుతున్న బ్రహ్మ రథోత్సవం

పావగడ: నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మ రథోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకుడు బదరీనాథ్‌ నేతృత్వంలో వేద పండితుల మంత్రోచ్చారణలతో మూల విరాట్‌ ఏడు పడగల సర్పాకార అంత్య సుబ్రహ్మణ్యస్వామికి పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రాతఃకాల షోడశ ఉపచార పూజలు, పంచామృతాభిషేకం, మహన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకం, ప్రాకారోత్సవం తదితర పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని తీసుకొచ్చి బ్రహ్మరథంలో ప్రతిష్ఠించారు. వంటశాలలో అన్నం రాశిపై నాగ దేవతను ఉంచగా ఆ అన్నం రాశి రెండు గా చీలింది. ఒక వైపు బ్రాహ్మణులకు, మరో వైపు రాశి భక్తులకని ప్రతీతి. వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. భక్తులు అరటి పండ్లను రథం మీదికి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఎమ్మెల్యే వెంకటేశ్‌, ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎండోమెంట్‌ అధికారి ఏసీ గోటూరు శివప్ప, తహసీల్దార్‌ వరదరాజు, మున్సిపల్‌ చైర్మన్‌ రాజేశ్‌ లాంఛనప్రాయంగా రథాన్ని లాగారు. భక్తులు రథానికి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం రథం యథాస్థానానికి చేరుకుంది.

చిన్నోడే.. దందాల్లో చాలా పెద్దోడు

- రాప్తాడు నియోజకవర్గంలో ముఖ్యనేత కుమారుడి దందా
- పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య వర్గాల నుంచి మామూళ్లు
- తాము టీడీపీ వాళ్లమన్నా కుదరదని తెగేసి చెప్పిన వైనం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాప్తాడు నియోజకవర్గంలో ఓ ముఖ్య నేత కుమారుడు డాన్‌లా వ్యవహరిస్తూ దోపిడీ రాజ్యానికి తెరతీశాడు. రాప్తాడుకు చెందిన కీలక నేత చిన్న కుమారుడు కూటమి సర్కారు కొలువుదీరిన రోజు నుంచే పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య వర్గాలపై పడ్డాడు. ప్రతి వారినీ పిలిపించుకొని ఎంత ఇవ్వాలో చెబుతున్నాడు. ఇవ్వని వారి వ్యాపారం మూతపడినట్లే. ఎదురు తిరిగిన వారిని తొక్కుకుంటూ వెళతామని బెదిరిస్తున్నాడు. ఇప్పటికే నియోజకవర్గంలోని సహజ సంపద ఇతని కనుసన్నల్లో తరలిపోతోంది. ముఖ్యంగా కృష్ణంరెడ్డి పల్లి సమీపంలోని గుట్టలు కొల్లగొట్టారు. గ్రావెల్‌, మట్టిని వందల లోళ్ల తరలించి సొమ్ము చేసుకున్నా మైనింగ్‌ అధికారులు కిమ్మనలేదు. తాజాగా రియల్‌ ఎస్టేట్‌ పెట్టుబడిదారులపై వసూళ్ల దందాకు దిగారు.

డబ్బులిస్తారా.. పనులు ఆపేయాలా?!

'ఇక్కడ మాదే రాజ్యం. మేము ఎంత చెబితే అంత. రూల్సు గీల్సూ ఉండవు. అధికారుల నుంచి అన్ని అనుమతులున్నా మా అనుమతి ఉండాల్సిందే' అంటూ ఆయన దందా చేస్తున్నారు. అనంతపురం శివారులోని ఓ బిల్డర్‌ రెండు చోట్ల అపార్ట్‌మెంట్లు కట్టాడు. ఇటీవల ఆయన్ను పిలిపించి రూ.2 కోట్లు డిమాండ్‌ చేసినట్టు తెలిసింది. 'ఫ్లాట్‌లు అమ్ముడుపోక ఇబ్బందుల్లో ఉన్నా'నని బిల్డర్‌ చెప్పినా వినలేదు. డబ్బు ఇవ్వకపోతే ఫ్లాట్‌లు అమ్ముకోలేరని గట్టిగా వార్నింగ్‌ ఇచ్చారు. దీంతో చివరకు రూ. కోటి ముట్టజెప్పి సెటిల్‌ చేసుకున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అనంతపురం నగరానికి 15 కిలోమీటర్ల దూరంలోని హంపాపురం వద్ద ఐదుగురు కలిసి 9 ఎకరాల్లో విల్లా కోసం వెంచర్‌ వేశారు. వీరిని కొన్ని రోజుల క్రితం చిన్నోడు పిలిపించి రూ.3 కోట్లు డిమాండ్‌ చేసినట్టు బాధితులు వాపోయారు. మూడు దఫాలు తన మనుషులను పంపించి పనులను ఆపించడంతో చివరకు వారు వెళ్లి కలిశారు. 'మేం గతంలో మీ నాన్న దగ్గర పనిచేశాం. మేం కూడా టీడీపీకి చెందిన వారమే' అని వారు చెప్పుకున్నా.. 'అది అదే, ఇది ఇదే..'అనడంతో కంగుతిన్నారు. ఇప్పటివరకూ ఒక్క రిజిస్ట్రేషన్‌ కూడా జరగలేదని, డబ్బులు ఇవ్వలేమని చెప్పగా.. వెంటనే అతని అనుచరులు తమ వద్ద ఉన్న డైరీ తీసి 9 రిజిస్ట్రేషన్‌లు జరిగాయని, ఆ విల్లాలు కొన్న వారి పేర్లతో సహా చెప్పడంతో వారికి మతిపోయినంత పనైంది. దీన్నిబట్టి సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో రోజూ ఎక్కడెక్కడ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయనే సమాచారం ఎప్పటికప్పుడు చిన్నోడికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. దీంతో వారు కూడా కొంత ముట్టజెప్పడంతో శాంతించారు.

పెట్టుబడులకు వెనకడుగు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం తర్వాత పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉన్న నియోజకవర్గాల్లో రాప్తాడు ఒకటి. బెంగళూరు-హైదరాబాద్‌ జాతీయ రహదారికి సమీపంలో ఉండటంతో గతంలో పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక టీడీపీ నేత కుమారుల దెబ్బకు పెట్టుబడులు పెట్టే నాథులే కరువయ్యారు. వచ్చిన వారు కూడా ఆమడ దూరం పారిపోయారు. గడిచిన ఏడు నెలల్లో ఒక్క చిన్న పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 'చిన్న రేకుల షెడ్డు వేసుకుని, ఏదైనా వ్యాపారం పెట్టుకున్నా వసూళ్లకు వస్తుంటే ఇక ఇక్కడ ఎందుకు పెట్టుబడి పెట్టాలి' అని జిల్లాకు చెందిన ఓ పారిశ్రామికవేత్త వాపోయారు. దీనికితోడు నియోజకవర్గంలో ప్రత్యర్థి పార్టీ నాయకులపై దాడులు, భూ ఆక్రమణలు షరా మామూలుగా మారడంతో సామాన్యులు కూడా భయకంపితులవుతున్నారు.

బోనులో కొండముచ్చు



పుట్లూరు: వారం రోజులుగా పుట్లూరు మండలం సంజీవపురం, ఓబుళాపురం గ్రామాల ప్రజలను ముప్పుతిప్పలు పెట్టిన ఓ కొండముచ్చు ఎట్టకేలకు బోనులో బందీ అయింది. పొలాలకు వెళుతున్న సమయంలో వెంటబడి తరుముతుండడంతో రైతులు, వ్యవసాయ కూలీలు బెంబేలెత్తిపోయారు. దీంతో ఆయా గ్రామాల ప్రజల ఫిర్యాదులపై స్పందించిన అటవీశాఖ అధికారులు ఎస్‌.బి. జగన్నాథం, వెంకటరమణ, సిబ్బంది కొండముచ్చు కదలికలను పరిశీలించి ఆదివారం బోను ఏర్పాటు చేసి, బంధించారు.

క్లుప్తంగా

రైలు కింద పడి యువకుడి మృతి

హిందూపురం అర్బన్: స్థానిక జీఆర్పీ పరిధిలోని గుడ్డం దోభీఘాట్ వద్ద పట్టాలపై ఓ గుర్తుతెలియని యువకుడి (30) మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ బాలాజీ నాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. శనివారం రాత్రి బెంగళూరు నుంచి పెనుకొండ వైపు వెళ్లే రైలు కింద పడి మృతి చెందినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. చేతిపై పెద్ద పచ్చబొట్టు ఉంది. ఆచూకీ తెలిసిన వారు 93988 66299కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

వేడినీళ్లు పడి చిన్నారికి గాయాలు

కనగానపల్లి: వేడి నీళ్ల శరీరంపై పడడంతో ఓ చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... కనగానపల్లి మండలం చంద్రాశ్చర్ల గ్రామానికి చెందిన మహేష్, ప్రవళిక దంపతులకు రెండేళ్ల వయసున్న కుమారుడు కృష్ణచైతన్య ఉన్నాడు. ఆదివారం సాయంత్రం స్నానం కోసమని ఆరుబయట పొయ్యిపై గిన్నెలో నీరు పెట్టి తల్లి ఇంట్లో పనిలో నిమగ్నమైంది. అదే సమయంలో ఇంటి బయట ఆడుకుంటున్న కృష్ణ చైతన్య నేరుగా వెళ్లి పొయ్యిపై ఉన్న గిన్నెను లాగడంతో వేడి నీరు ఒక్కసారిగా మీదపడింది. దీంతో చిన్నారి ముఖం, చేతులు తీవ్రంగా గాయపడ్డాయి. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

అమ్మా.. నన్ను క్షమించు!


సోమశేఖర్‌రెడ్డి (ఫైల్)

రొద్దం: 'అమ్మా...నన్ను క్షమించు' అంటూ సూసైడ్ నోట్ రాసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన అనంతరం ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రొద్దం మండలం రాచూరు గ్రామానికి చెందిన లక్ష్మీనరసమ్మ కుమారుడు సోమశేఖరరెడ్డి (23) గత ప్రభుత్వంలో గ్రామ వలంటీర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. అయితే నిర్దిష్ట కారణమేమిటో తెలియదు కానీ, ఆదివారం ఉదయం ఎల్‌జీబీ నగర్ సమీపంలోని ఓ తోట వద్ద వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకు ముందు సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టాడు. 'అమ్మా.. నన్ను క్షమించు. నీ కొడుకుగా నీకు అన్యాయం చేస్తున్నా. నా లైఫ్‌లో ఇష్టం లేని చాలా పనులు చేశాను. నాకు బతకడం ఇష్టం లేదు. ఒకరి వల్ల నేను చావలేదు... నేనే చస్తున్నా. ఎవరిని కూడా ఇందులో ఇరికించకండి. లవ్ యూ అమ్మా... నన్ను క్షమించండి' అని తన పోస్టులో పేర్కొన్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరేంద్ర సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆకు పచ్చని బంగారం!

చిన్న, సన్నకారు రైతుల జీవితాల్లో వెలుగులు నింపే సామర్థ్యమున్న ఆకుపచ్చని బంగారం అది. సారవంతం లేని భూమైనా పర్వాలేదు.. గ్యారంటీగా పంట పండుతుంది. రైతులకు కాసుల వర్షం కురిపిస్తుంది. రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడే పంటగా గుర్తింపు పొందిన ఆ పంటే వెదురు సాగు. గ్రామీణ పేదలకు మంచి ఉపాధి అవకాశాలు కల్పించే వనరు కూడా వెదురే కావడం గమనార్హం. వెదురు వినియోగం పెరిగే కొద్ది మార్కెట్‌లో దాని విలువ బంగారంతో సమానంగా ఎగబాకుతోంది. అందుకే దీనిని 'గ్రీన్ గోల్డ్' (ఆకుపచ్చని బంగారం)గా ముద్దుగా పిలుస్తుంటారు. స్వల్ప పెట్టుబడితో దీర్ఘకాలిక ఆదాయం పొందే ఈ పంటపై ఓ చిరుద్యోగి దృష్టి సారించి సఫలీకృతుడయ్యారు. సాగు ఆరంభంలో అందరూ నవ్వుకున్నా... పట్టు వీడని విక్రమార్కుడిలా సత్ఫలితాలు సాధించారు. అందరి చేత శభాష్ అనిపించుకున్నారు.




రైతు పాటిల్ వంశీకృష్ణారెడ్డి


గొల్లపల్లి వద్ద వెదురు సాగు

- కోతకొచ్చిన వెదురు సాగు
- ఆరంభంలోనే అధరహో
- ఎకరాకు 15 నుంచి 20 టన్నుల దిగుబడి
- తోట వద్దకే క్యూ కడుతున్న వ్యాపారులు

రాయదుర్గం: జిల్లాలో వెదురు సాగు రైతు అంటూనే ఠక్కున గుర్తొచ్చేది గుమ్మఘట్ట మండలం గొల్లపల్లికి చెందిన పాటిల్ వంశీకృష్ణారెడ్డి. జిల్లాలో తొలిసారి వెదురు సాగుకు శ్రీకారం చుట్టి అటు ఉద్యానశాఖ అధికారుల్లో, ఇటు అన్నదాతల్లో ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఎంబీఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన బళ్లారిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో చిరుద్యోగిగా స్థిరపడ్డారు. కరోనా కారణంగా ఉద్యోగం వీడి వ్యవసాయంపై దృష్టి సారించారు. అందరిలా వరి, మొక్కజొన్న, రాగి, సజ్జ, పత్తి లాంటి పంటలు కాకుండా వినూత్న ఆలోచనతో 10 ఎకరాల్లో వెదురు సాగు చేపట్టారు. ఎకరాకు రూ.50 వేలు చొప్పున రూ.5 లక్షలు పెట్టుబడి అయింది. మూడేళ్ల పాటు పంటను కాపాడుతూ వచ్చారు. ఇది చూసిన చాలా మంది హేళనగా మాట్లాడారు. అయినా ఆయన వెనుదిరిగి చూడలేదు.

మూడేళ్ల తర్వాత కోతలు..

వంశీకృష్ణారెడ్డి సాగు చేసిన వెదురు పంట మూడేళ్ల తర్వాత ప్రస్తుతం కోతకు వచ్చింది. ఎకరాకు 15 నుంచి 20 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. మార్కెట్లో టన్ను వెదురు ధర రూ.6 వేలు పలుకుతోంది. నాణ్యమైన వెదురు కావడంతో వంశీకృష్ణారెడ్డి పొలం వద్దకే కొనుగోలుదారులు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో ధర పెంచేందుకు కూడా వెనుకాడడం లేదు. సరాసరి ఎకరాకు 20 టన్నులతో పదెకరాలకు 200 టన్నులకు పైగా దిగుబడి వచ్చింది. టన్ను రూ.6 వేలతో లెక్కించినా రూ.12 లక్షల ఆదాయం ఇంటి వద్దకే సమకూరింది. వచ్చే ఏడాది 25 నుంచి 30 టన్నులు, ఐదో ఏడాది 45 నుంచి 50 టన్నులకుపైగా దిగుబడి వస్తుందని రైతు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారి పంట కోతలు చేపడితే.. ఆ తర్వాత కేవలం నీటి తడులతోనే పంట ఏపుగా పెరుగుతుందని పేర్కొటున్నారు. పైగా కోత దశకు వచ్చిన వెదురు పంటలో వ్యర్థమన్నదే ఉండదంటున్నారు. చిన్న పరిమాణంలో ఉన్న వెదురు కర్రలకు సంబంధించి టన్ను రూ.5వేలకు పైగా చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. వీటిని టమాట, ఇతర పంటల సాగులో ఊతకర్రలుగా వినియోగిస్తుంటారు.


మొదటి ఏడాది వెదురు సైజు ఇలా


కోత కోసిన తర్వాత కొలతలు తీస్తున్న దృశ్యం

ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఉన్నాయి..

సాగుకు యోగ్యంగా లేని భూములైన సరే నీటి వసతి ఉంటే వెదురు సాగుకు అనుకూలం. వెదురు సాగుతో మిగిలిన రైతులకు వంశీకృష్ణారెడ్డి ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం గుంతకల్లు మండలం నక్కదొడ్డిలో ఇద్దరు రైతులు ఎనిమిది ఎకరాల్లో సాగుకు శ్రీకారం చుట్టారు. వెదురు సాగుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందజేస్తాం. ఎకరం పది సెంట్లలో నర్సరీ ఏర్పాటు చేసుకుంటే రూ.10 లక్షలు ఇస్తాం. వెదురు మొక్కలు రాయితీతో అందించడంతో పాటు ప్రధాన పంటగా సాగు చేస్తే హెక్టారుకు రూ.50 వేలు చెల్లిస్తాం. కంచె పంటగా సాగు చేస్తే రెండు మీటర్లకు ఒక మొక్కకు రూ.25 చొప్పున రాయితీ ఉంటుంది. ఒక్కొక్క రైతుకు గరిష్ఠంగా రెండు హెక్టార్లకు ప్రోత్సాహకాలు అందించేలా మార్గదర్శకాలు ఉన్నాయి.

– నరసింహారావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి, అనంతపురం

భార్య ఎడబాటు తట్టుకోలేక భర్త ఆత్మహత్య

పెద్దపప్పూరు: భార్య మృతితో ఎడబాటును తట్టుకోలేక చివరకు భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... పెద్దపప్పూరు మండలం శింగనగుట్టపల్లికి చెందిన నారాయణస్వామి (38), లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో 28 రోజుల క్రితం క్రిమి సంహారక మందు తాగి లక్ష్మి ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి దిగాలుగా ఉన్న నారాయణస్వామి శనివారం అర్ధరాత్రి కలుపు నివారణ మందు తాగాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు చికిత్సకు స్పందించక ఆదివారం సాయంత్రం ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

గార్లదిన్నె: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్త, ఆయన తండ్రిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. వివరాలు.. గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన కావ్యశ్రీకి ఏడాది క్రితం కళ్యాణదుర్గం శీబావి నివాసి వన్నూరుస్వామితో వివాహమైంది. ఇటీవల అదనపు కట్నం కోసం కావ్యశ్రీని భర్తతో పాటు మామ కుళ్లాయప్ప వేధిస్తుండడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారిపై కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య



తాడిపత్రి రూరల్: మండలంలోని కోమలి సమీపంలో రైలు కింద పడి ఓ గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో కో–పైలెట్ సమాచారంతో ఆర్‌పీఎఫ్ హెచ్‌సీ వరప్రసాద్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో తాడిపత్రిలోని రైల్వే స్టేషన్ నుంచి గుత్తికి వెళ్లే రైలుకు కొనుగోలు చేసిన టికెట్ లభ్యమైంది. అంతకు మించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు.

8వ వేతన సంఘం సమస్యపై పార్లమెంట్‌లో చర్చించండి

- కేంద్ర రైల్వే సహాయ మంత్రికి తపాలా ఉద్యోగుల వినతి

అనంతపురం సిటీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఎనిమిదో వేతన సవరణ సమస్యను పరిష్కరించేలా ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో చర్చించి, బిల్లు పాస్ అయ్యేలా చొరవ తీసుకోవాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్(ఏఐజీడీఎస్‌యూ) అనంతపురం డివిజన్ కార్యదర్శి పి.కృష్ణయ్య యాదవ్ కోరారు. ఈ మేరకు జిల్లా పర్యటనకు ఆదివారం విచ్చేసిన కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను కలసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన వేతనాలు, పెన్షన్ల సవరణ ప్రక్రియ ప్రతి పదేళ్లకు ఒకసారి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం లేదన్నారు. వేతన సవరణకు మరో ఏడాది మాత్రమే గడువు ఉండడంతో ఇప్పటి నుంచే ఆ ప్రక్రియ మొదలు పెట్టేలా చూడాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని అనంతరం విలేకరులకు కృష్ణయ్య వివరించారు.


కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్నకు వినతిపత్రం ఇస్తున్న డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య

నూర్పిడి ప్రక్రియను పరిశీలించిన ఢిల్లీరావు

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లి క్రాస్‌లో రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా ఉత్పత్తిదారుల సంఘం చిరు ధాన్యాల నూర్పిడి యంత్రాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు ఆదివారం పరిశీలించారు. కొర్రలు, సామలు, అరికలు, అండుకొర్రలు, రాగుల నూర్పిడి విధానాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. చిరుధాన్యాల ప్రాసెసింగ్‌ను ప్రత్యక్షంగా పరిశీలించారు. మార్కెటింగ్, గిట్టుబాటు ధరలు తదితర అంశాలపై సంస్థ డైరెక్టర్ భానుజాను అడిగి తెలుసుకున్నారు. కొర్రలతో తయారు చేసిన కేక్‌ను కట్ చేసి రుచి చూశారు. తక్కువ ఖర్చుతో చిరుధాన్యాలు సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంట జేడీఏ సుబ్బారావు, కదిరి ఆర్డీఓ ఎస్ఎస్ రావు, ఏడీఏలు సనావుల్లా, సత్యనారాయణ, ఏఓలు శ్రీనివాసులరెడ్డి, లక్ష్మీప్రియ, వ్యవసాయ సిబ్బంది, రెడ్స్ సంస్థ సిబ్బంది, మహిళా రైతు ఉత్పత్తి దారుల సంఘం సభ్యులు ఉన్నారు.


చిరుధాన్యాల నూర్పిడి ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు

రైతులతో ముఖాముఖి

కదిరి టౌన్: మండలంలోని కదిరి బత్తలపల్లి గ్రామంలో రైతు గుర్రప్ప సాగుచేసిన చియా పంటను వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు ఆదివారం పరిశీలించారు. అనంతరం గ్రామ రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయానికి సంబంధించిన పలు సూచనలు చేశారు.


హామీలు నిలబెట్టుకోవాలి : ఏపీటీఎఫ్


మాట్లాడుతున్న రఘురామిరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించి ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, ఆర్థికేతర సొలభ్యాలకు తక్షణమే పరిష్కారం చూపాలని కూటమి ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘురామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని హితవు పలికారు. లేకుంటే ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి, పూర్వ కార్యదర్శి బి.నరసింహులు, సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, నాయకులు బి.వెంకటేశులు, నాగరాజు, మోహన్‌రెడ్డి, సతీష్‌కుమార్, బొమ్మయ్య, చెన్నకేశవులు, సర్దార్‌వలి, రమణ, తలారి కృష్ణ, వన్నప్ప, గురురాజు పాల్గొన్నారు.

ఈడిగలు రాజకీయశక్తిగా ఎదగాలి

- శివ సాయిబాబా, వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు బీసీ రమేష్‌గౌడ్


ఐక్యత చాటుతున్న ఈడిగ (గౌడ) కులస్తులు

రాప్తాడురూరల్: ఐక్యమత్యంగా ఉంటూ రాజకీయ శక్తిగా ఎదగాలని ఈడిగ కులస్తులకు శివసాయిబాబా, వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు బీసీ రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. అనంతపురం రూరల్ మండలం రాయల్‌నగర్‌లో వెలసిన రేణుకా యల్లమ్మ ఆలయ కల్యాణమంటపంలో ఈడిగ (గౌడ) సంక్షేమ సంఘం, రేణుకా యల్లమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యవర్గాల ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. రేణుకా యల్లమ్మ సొసైటీ అధ్యక్షుడు జె.నాగేశ్వరరావు, ఈడిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేంద్ర కుమార్ గౌడ్, కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ముఖ్య అతిథులుగా హాజరైన శివసాయిబాబు, రమేష్‌గౌడ్ మాట్లాడుతూ... ఈడిగ కులస్తులు పూర్వం నుంచి కులవృత్తి కల్లుగీతతో జీవనం సాగిస్తున్నారన్నారు. మారుతున్న కాలానుగుణంగా పిల్లలను చదివిస్తూ ఆర్థికాభివృద్ధి చెందుతున్నారన్నారు. కులస్తుల అభివృద్ధికి తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈడిగ సంక్షేమ సంఘం, రేణుకా యల్లమ్మ సొసైటీ సభ్యులు ఆదినారాయణ, రాజు, కుళ్లాయిస్వామి, చంద్ర, రఘురామయ్య, నారాయణస్వామి, బలరాం, గౌడ ఉద్యోగుల సంఘం అధ్యక్ష,కార్యదర్శులు విశ్వనాథ్, మనోహర్, రవీంద్ర, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం


బాబు (ఫైల్)

రొద్దం: కర్ణాటకలో చోటు చేసుకున్న ప్రమాదంలో రొద్దం మండలానికి చెందిన యువకుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు.. రొద్దం మండలం ఎం.కొత్తపల్లికి చెందిన అంజినప్ప కుమారుడు బాబు (23) బతుకు తెరువు కోసం బెంగళూరుకు వెళ్లి అక్కడే కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం నెలమంగల టోల్‌గేట్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న బాబును వెనక నుంచి లారీ ఢీ కొంది. ఘటనలో తల ఛిద్రమై బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి తల్లి జయమ్మ రోదనకు అంతులేకుండా పోయింది.


పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో నిండిన వార్డు


ఓపీ రోగులతో కిటకిటలాడుతున్న పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రి

బాబోయ్ చలి


- ఇబ్బంది పెడుతున్న శ్వాసకోశ వ్యాధులు
- నిమోనియాతో ముగ్గురు చిన్నారుల మృతి

పెనుకొండ రూరల్: ఇటీవల వరుస తుపానుల కారణంగా గత మూడు నెలలుగా వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. చలి గాలుల తీవ్రత పెరిగింది. ఫలితంగా జిల్లా వాసులపై సీజనల్ వ్యాధులు ముప్పెట దాడి చేస్తున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యశాలల్లో ఓపీల సంఖ్య రోజూ వేలల్లో నమోదవుతోంది. ఇదే అదనుగా భావించిన ప్రైవేట్ క్లినిక్ నిర్వాహకులు, ఆర్ఎంపీలు ధనార్జనే ధ్యేయంగా రోగులను లూటీ చేస్తున్నారు.

అమ్మో... నిమోనియా

గత ఐదు నెలలుగా జిల్లాలో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా చలి తీవ్రత పెరిగి ప్రజలు నిమోనియా బారిన పడుతున్నారు. ఆరేళ్ల వయస్సు లోపు చిన్నారులు, 60 ఏళ్ల పైబడిన వృద్ధుల్లో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది. ఊపిరితిత్తుల్లోకి నెమ్ము చేరుకోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత మూడు నెలల వ్యవధిలోనే నిమోనియా బారిన పడిన చిన్నారుల్లో ముగ్గురు మృత్యువాత పడడం బాధాకరం.

అప్రమత్తంగా ఉన్నాం



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉన్నాం. ఇప్పటికే క్రమం తప్పకుండా క్షేత్ర స్థాయిలో సర్వేలతో పాటు సకాలంలో చికిత్సలూ అందజేస్తున్నాం. నిమోనియాతో ముగ్గురు చిన్నారుల మృతిచెందడం బాధాకరం. సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు విస్తృతం చేశాం.

– డాక్టర్ ఫిరోజ్ బేగం, డీఎంహెచ్ఓ

గత ఐదు నెలలుగా జిల్లా వ్యాప్తంగా ఆస్పత్రుల్లో నమోదైన ఓపీ వివరాలు..

నెల	ఓపీల సంఖ్య
ఆగస్టు	5,09,913
సెప్టెంబర్	5,09,036
అక్టోబర్	4,83,115
నవంబర్	5,15,169
డిసెంబర్	4,95,550

నిమోనియాతో మృతి చెందిన చిన్నారులు

మండలం	గ్రామం	మృతి చెందిన నెల	వయస్సు
రామగిరి	పేరూరు	అక్టోబర్ 1, 2024	3 నెలలు
గోరంట్ల	కొండాపురం	అక్టోబర్ 10, 2024	1 నెల
బత్తలపల్లి	బత్తలపల్లి	నవంబర్ 15, 2024	23 నెలలు